క్లుప్తంగా

ఇంటి వద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని రాసనపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అన్నపూర్ణ, శిరీషా, మల్లిక, సుధా పాల్గొన్నారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఆపరేషన్లు చేసుకున్న 26 మందికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు ఎంఎల్‌హెచ్‌పీ దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రోజారమణి, ఆశా కార్యకర్తలు పుణ్యవతి, మునెమ్మ పాల్గొన్నారు.

నేడు గరుడసేవ

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా గరుడసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయంలో వెలసిన మూలవిరాట్‌కు గంధాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు వైకుంఠ ద్వారంలో స్వామివారి దర్శనం కల్పించనున్నారు. అనంతరం ఉదయం 9 గంటలకు స్వామివారు గరుడవాహనంపై పుర వీధుల్లో ఊరేగనున్నట్లు వివరించారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



ఈ-క్రాప్‌ను పరిశీలిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రబీలో రైతులు సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. మండలంలోని వీఎస్ అగ్రహారంలో రబీలో సాగు చేసిన వరి పంట ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, వాతావరణ బీమా అందుతాయన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు రేపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆస్థాన మండపంలో ప్రజాప్రతి చారిటబుల్ ట్రస్ట్ తిరుపతి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శనలకు ఆలయ అధికారులు, సిబ్బంది, ఉభయదారులు హాజరుకావాలని కోరారు.

జెడ్పీటీసీ తండ్రి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: తవణంపల్లె జెడ్పీటీసీ సభ్యురాలు భారతి మధుకుమార్ తండ్రి రిటైర్డు బ్యాంక్ ఉద్యోగి రామమూర్తి గురువారం రాత్రి బంగారుపాళెం మండలం మొగిలివెంకటగిరి గ్రామంలో మృతి చెందారు. సమాచారం అందుకుని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, స్థానిక జెడ్పీటీసీ సోమశేఖర్ తోపాటు పలువురు నాయకులు శుక్రవారం మొగిలివెంకటగిరికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దరఖాస్తు చేసుకోండి

శాంతిపురం: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం (పీఎంకెవీవై 4.0) పథకంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శాంతిపురం ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నగేష్ చెప్పారు. పదిపాసైన, ఐటీసీ మధ్యలో ఆపేసిన 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న వారు జనవరి 10వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మురిపించే అదనపు కానుక

- జనవరి నుంచి పింఛన్ రూ.3 వేలు
- పింఛనుదారుల్లో 'నూతన' సంతోషం
- మండలంలోని 8,399 మందికి లబ్ధి

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏటా పింఛన్ కానుక మొత్తాన్ని పెంచుకుంటూ వస్తున్నారు. జనవరి నుంచి పింఛన్ కానుక మరో రూ.250 పెరగనుంది. కొత్త ఏడాదిలో పింఛన్ లబ్ధిదారులు రూ.3 వేలు అందుకోనున్నారు. గతంలో పింఛను కోసం పడిన అగచాట్లన్నీ జగనన్న ప్రభుత్వంలో తొలగిపోయాయి. పింఛనుదారులు ఎలాంటి కష్టం లేకుండా గడపవద్దనే పింఛను అందుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు.

పూతలపట్టు: వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన సంవత్సరం అదనపు కానుక అందిస్తోంది. వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో ప్రతి నెలా ఠంఛనుగా ప్రభుత్వం రూ.2,750 అందిస్తోంది. దీనికి అదనంగా రూ.250 కలిపి మొత్తం రూ.3000 పింఛను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు మంత్రి వర్గం ఆమోదం కూడా తెలిపింది. జనవరి నుంచి పెంచిన పింఛను కానుక అందించాలని అధికారులకు ఉత్తర్వులు అందాయి. అధికార యంత్రాంగం ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది.

మండలంలో 8,399 మందికి లబ్ధి

వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే వివరాలన్నీ పరిశీలించి, పార్టీలకతీతంగా అర్హులకు పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో 8,399 మందికి ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తోంది. జనవరి నుంచి ప్రభుత్వం రూ.250 పెంచనుండడంతో మండలంలో ప్రతి నెలా దాదాపు 20 లక్షలకు పైగా అదనపు లబ్ధి చేకూరనుంది.



నాడు: పింఛను కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



నేడు: వేలూరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు

గతంలో అమ్మో ఒకటో తారీఖు

గత ప్రభుత్వంలో పింఛన్‌దారులు అమ్మో ఒకటో తారీఖు అనుకునేవారు. ఎక్కడ పింఛన్ ఇస్తున్నారో తెలియక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర అవస్థలు పడేవారు. కొత్త పింఛన్ కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కేవలం పచ్చ చొక్కావారికి, వారి సానుభూతి పరులకు మాత్రమే లబ్ధి చేకూర్చేందుకు ప్రాధాన్యతనిచ్చేవారు. పింఛన్ ఇచ్చే పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఉన్నాడో? లేడో? తెలుసుకోవడానికే నానా తిప్పలు పడేవారు. సెక్రటరీ వస్తారంటే తెల్లవారుజాము నుంచి పనులన్నీ విడిచిపెట్టి క్యూలో పింఛన్ పుస్తకం పెట్టి కాసుక్కూచునేవారు. అది కూడా కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇచ్చారు. తీరా ఎన్నికల ముందు నెల నుంచి మరో రూ.వెయ్యి పెంచి రూ.2వేలు చేశారు.

నేడు ఆహా ఒకటో తేదీ

అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ల పంపిణీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అర్హులైన వారందరికీ పార్టీలకతీతంగా పింఛన్ మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఇంటివద్దకే పింఛన్ అందజేసే వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పింఛన్ల పంపిణీలో ఉన్న ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. తెల్లవారుజామునే గడప దాటాల్సిన పనిలేకుండా వలంటీర్లే వచ్చి, పింఛన్ నగదు అందించి వెళ్లేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో పింఛనుదారులందరూ ఎంతో సంతోషంగా ఒకటో తేదీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. పింఛను అందుకోగానే ఆహా ఒకటో తారీఖు అనుకుంటూ మురిసిపోతున్నారు.

చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా చెబితే తప్పకుండా చేస్తారనే నమ్మకం అందరిలోనూ ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. చెప్పనివి కూడా పేద ప్రజల కోసం ఎన్నో చేశారు. పింఛన్ మొత్తం చెప్పినట్లే పెంచుకుంటూ వెళ్లారు. జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ ఇస్తానన్నారు. జనమంతా మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నారు.

–ఆదెమ్మ, పాటూరు, పూతలపట్టు

జగన్ మా పెద్ద కొడుకు



సీఎం జగన్ వయసుడిగిన మమ్మల్ని పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు. మాలాంటి వారిలో కొందరికి కుటుంబంలో కాస్తయినా ఆదరణ ఉందంటే వారికొచ్చే పింఛనే కారణం. జగన్‌బాబు మాటిస్తే మడమ తిప్పడు. ఆ బాబు నూరేళ్లు చల్లగా ఉండాలి. మాలాంటి వారిని మరింత ఆదుకోవాలి, మా ఆశీస్సులెప్పుడు జగన్‌కు ఉంటాయి.

–మునిలక్ష్మి, బి.రామాపురం, పూతలపట్టు

అర్హులందరికీ పింఛన్



మండలంలో అర్హత ఉన్న ప్రతి ఒక లబ్ధిదారునికి పింఛన్ కానుకను అందజేస్తున్నాం. ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్లు పింఛన్ అందజేస్తున్నారు. పింఛన్ రద్దయిన వారికి మరోసారి సరిచూసి, అర్హులై ఉంటే వారి దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాము. ప్రతి నెలా రూ.2 కోట్లకు పైగా నగదును మండలంలోని పింఛన్ లబ్ధిదారులను అందజేస్తున్నాం.

–గౌరి, ఎంపీడీఓ, పూతలపట్టు

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మొగిలీశ్వర్

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సర్పంచ్ నిర్మల, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర, ఎంపీటీసీ హరి పాల్గొని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల చదువులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నకే సాధ్యం



కరపత్రాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

యాదమరి: రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాలంటే జగనన్నకే సాధ్యం అని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి అన్నారు. మండలంలోని మాదిరెడ్డి పల్లె గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారికి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఇంటి పరిసరాలను తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరం పెద్ద దళితవాడలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. ఇంటింటా పరిశీలన చేశారు. దోమల నివారణకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, పీరుసాహెబ్, గోపి, రమాదేవి పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటివైద్య శిబిరం

చిత్తూరు రూరల్: నగరంలోని రాముల గుడివీధిలో ఉన్న శ్రీ జైన్ సంఘ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులు ఉదయం 7 నుంచి 10 గంటలకు వరకు శిబిరంలో ఉంటారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియామకం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీకి అనుబంధంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల విభాగం జిల్లా కన్వీనర్‌గా చిత్తూరు నగరానికి చెందిన షణ్ముగం నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని షణ్ముగం పేర్కొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ఉచిత వైద్యం

యాదమరి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం మన జగనన్న అందిస్తున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి తెలిపారు. మండలంలోని మాదిరెడ్డి పల్లె, మోర్థానపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం గ్రామీణ ప్రజలకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మంచి వైద్యం అందించడమే కాకుండ ఇంటి వద్దకే వచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామీణ ప్రజలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, ఎంపీడీఓ శివరాజ్, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, సర్పంచ్ వాసురెడ్డి, మీనా, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు





మామిడిసాగులో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదనరెడ్డి, హాజరైన రైతులు

బంగారుపాళెం: మామిడిలో సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదనరెడ్డి అన్నారు. బంగారుపాళెం మామిడి మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం మామిడిలో పూత, పిందె దశలో చేపట్టాల్సిన సస్యరణ చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మామిడిలో పంట కోత అనంతరం మళ్లీ పంట ప్రారంభ దశ వరకు సమగ్ర సస్యరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎరువుల వినియోగం నుంచి పంటను ఆశించే చీడపీడల నివారణకు వరకు తగుచర్యలు తీసుకున్నప్పుడే నాణ్యతతో కూడిన దిగుబడి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందన్నారు. ఒక సంవత్సరం పంట అధికంగా వస్తే మరుసటి ఏడాదికి దిగుబడి తగ్గుతూ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించి సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. చిత్తూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర సాగులో రైతులు చేపటాల్సిన పద్ధతులపై సూచనలు, సలహాలు అందజేశారు. ప్రస్తుతం మామిడిలో పూత కాలం మొదలవుతోందన్నారు. ఈ నేపథ్యంలో తోటలో పూత ఒకేసారి రావడానికి పొటాషియం నైట్రేట్ (13:00:45)10 గ్రాములు, ఆర్కామాంగో స్పెషల్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మొగ్గ దశలో మొదటి దఫా మోనోక్రోటోఫాస్1.6 మిలీ, మాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పచ్చిపూత దశలో బ్యుప్రోఫెజిన్ 1.5 మి.లీ, హెక్సాకోనజోల్ 2 మి.లీ, అజాడిరాక్టిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తెల్లపూత దశలో ఎటువంటి మందులను పిచికారీ చేయరాదన్నారు. నల్లపూత దశలో బ్యుప్రోఫెజిన్ 1 గ్రాము, అసిఫేట్ 1 గ్రాము, థయోఫీనేట్‌మిథైల్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కాయలు వృద్ధి చెందే దశలో నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కాయలకు కవర్లు కట్టడం వల్ల నాణ్యమైన కాయలు పొంది ధర ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యానఅధికారి లక్ష్మీప్రసూన, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా సమగ్రశిక్ష శాఖ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సమగ్రశిక్ష శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు దేవరాజ్ కోరారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు కల్పన, విశ్వనాథం, శ్రీనివాసులు, పలు మండలాల నుంచి సమగ్రశిక్ష శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా ఉంటాం

చిత్తూరు రూరల్: నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని మేయర్ అముద అన్నారు. నగరంలోని నిరాశ్రయుల వసతి గృహంలో శుక్రవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జోసఫ్‌రాజ్, సిబ్బంది ప్రమీల సరేష్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మేయర్ అముద

విద్యార్థులు గణిత మేధావులుగా ఎదగాలి

- పాఠశాలల్లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం
- శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు

బంగారుపాళెం: విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని గణిత మేధావులుగా ఎదగాలని ఎంఈఓ-2 రమేష్‌బాబు అన్నారు. మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఏపీ మ్యాథ్స్ ఫోరమ్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రామానుజన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ముగ్గురు విద్యార్థులు తేజరెడ్డి, గగన్‌దీప్, పార్థసారథిచే బాలగణిత అష్టావధాన కార్యక్రమాన్ని ఆకట్టుకుంది. పృచ్ఛకులు అడిగిన గణిత ప్రశ్నలకు బాల అవధానులు ఇచ్చిన సమాధానాలు అబ్బుర పరిచాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను మార్కుల ద్వారా కాకుండా ప్రజ్ఞ ద్వారా వెలుపలకు తీయవచ్చన్నారు. విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని గణితంలో ప్రతిభ కనబరిచేందుకు ప్రయత్నించాలని సూచించారు. అవధాని అరుణ్ శివప్రసాద్ మాట్లాడుతూ, చిత్తూరు పట్టణ పరిధిలో 13 పాఠశాలల్లో 30 మంది విద్యార్థులతో గణిత అవధాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, ప్రభాకర్, గణిత ఉపాధ్యాయులు రవిచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు రుషేంద్రపతి, పిళ్లారప్ప, ప్రేమకృష్ణ, సుధాకర్, మోహన్‌రెడ్డి, సంజీవి, భారతి, అమరనాథ్, బాలయ్య, సంపంగి, ధనశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: బాల గణితావధానులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



యాదమరి: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరామానుజం జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం లలిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గణితంపై మక్కువతో గణితం అభ్యాసం చేస్తే అన్ని రంగాల్లో రాణించగలరని వివరించారు. అనంతరం గణిత దినోత్సవంపై వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి, 54 గణిత ప్రదర్శనలు చేశారు. విశేష ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కనకాచ్చారి, ఉపాధ్యాయులు ఉషారాణి, భారతి, భాస్కర్ రెడ్డి, సుల్తాన్, నీలావతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు

గుడిపాల: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు నరహరిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు. మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజం జన్మదినం సందర్భంగా పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, నృత్య పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గణితంలో రామానుజానికి మించిన దిగ్గజం లేదన్నారు. 7, 8 తరగతి విద్యార్థులు సాయి, ఉమాశంకర్ గణితంలో తమ ప్రతిభను కనబరిచినందుకు ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి

తవణంపల్లె: మండలంలోని తవణంపల్లె, అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త, మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ గణితాన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. గణిత ఆవశ్యకతను వివరించారు. అనంతరం సాంస్కృతిక, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు దేవరాజులరెడ్డి, శ్రీలక్ష్మి, షణ్ముఖసుందరం, విజయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తవణంపల్లె: రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గుడిపాల: విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు